# కుల వృత్తులకు భరోసా

- పూర్వ వైభవం తీసుకొచ్చిన సర్కారు
- సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషి
- బీసీ కుల వృత్తిదారులకు రూ. లక్ష సాయం
- ఆనందంలో లబ్ధిదారులు


సెలూన్ షాపులో క్షౌరం చేస్తున్న నాయీబ్రాహ్మణుడు

ఖానాపూర్, అక్టోబర్ 16 : గత ప్రభుత్వాల పాలనలో చితికిపోయిన కుల వృత్తులు స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవం పోసుకుంటున్నాయి. సమైక్య పాలనలో తగిన ప్రోత్సాహం కరువై చేతి వృత్తులు మూలన పడ్డాయి. పట్టణాల్లో సరైన ఉపాధి లేక వలస బాట పట్టారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక చేతి వృత్తులకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి పేదల బతుకుల్లో భరోసా నింపుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనుల చేపట్టడంతో వలసదారులు తిరిగి ఇంటి బాట పట్టారు. సొంత ఊరిలో కుల వృత్తులు చేసుకుంటూ తలెత్తుకొని జీవనం కొనసాగిస్తున్నారు. సీఎం కేసీఆర్ సార్‌ను మరొక్కసారి గెలిపించుకుంటామని వారు పేర్కొంటున్నారు. బీసీ వృత్తిదారులకు రూ. లక్ష చొప్పున అందిస్తూ వారి జీవితాల్లో మరింత ఆసరా కల్పిస్తున్నది. దీంతో ఉన్న ఊరిలో దర్జాగా పని చేసుకుంటూ జీవిస్తున్నామని, సీఎం కేసీఆర్ రుణపడి ఉంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**మొదటి విడుతలో 50 మందికి..**

నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలంలో అధికారులు 3536 మంది లబ్ధిదారులకు(బీసీ కులవృత్తిదారులు) రూ. లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 3240 మంది దరఖాస్తు చేసుకోగా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి 3240 మందిని అర్హులుగా గుర్తించారు. ఇందులో మొదటి విడుతగా మండల వ్యాప్తంగా 50 లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కాగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు సెలూన్లు, లాండ్రీ షాపులు పెట్టుకున్న రజకులకు 250 యూనిట్ల ఉచిత కరెంట్‌ను ఉచితంగా అందిస్తున్నది.

**సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోలేనిది..**



సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటికే రజకులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నది. కుల వృత్తులను ప్రోత్సాహిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం వృత్తిదారులకు బీసీ బంధు పథకం కింద రూ. లక్ష సాయం చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నది. నాయీబ్రాహ్మణులను నాటి నాయకులు, ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కానీ నేడు దరఖాస్తు చేసుకున్న మాకు ప్రభుత్వం బీసీ బంధు చెక్కు అందజేసింది. ఆర్థికంగా ఎదుగలకు బీసీ బంధు పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలాంటి పథకంతో వృత్తిపై భరోసా కల్పించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటా.

\- సిలివెరి సత్యనారాయణ, నాయీబ్రాహ్మణ సంఘం నేత

**సెలూన్ షాపును డెవలప్ చేసుకున్నా..**



నేను గత ఐదేండ్ల నుంచి ఖానాపూర్‌లో సెలూన్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నా. షాపును అభివృద్ధి చేసుకోవడానికి తగిన డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డా. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీసీ బంధు పథకానికి దరఖాస్తు చేసుకున్నా.అధికారులు వచ్చి సర్వే చేశారు. ఆ తర్వాత నన్ను అర్హునిగా గుర్తించి రూ. లక్ష చెక్కును అందశారు. దీంతో నా షాపును డెవలప్ చేసుకొని మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నా. నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి మేము అండగా ఉంటాం.

\- మొలంకల రామకృష్ణ, గోడలపంపు

## మంత్రి వేముల ప్రశాంతరెడ్డికి పరామర్శ

కడెం, అక్టోబర్ 16 : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందగా, సోమవారం బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ నిజామాబాద్ జిల్లా వెల్పూర్‌లో మంత్రి నివాసంలో ఆయనను కలిసి పరామర్శించారు. ఆయన తల్లి మృతిపై ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం వారి తల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయనవెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.


మంత్రి ప్రశాంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న జాన్సన్‌నాయక్

## మాజీ ప్రధాన న్యాయమూర్తి పూజలు


అమ్మవారి సన్నిధిలో మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

బాసర, అక్టోబరు 16 : సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ సోమవారం బాసర సరస్వతీ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయన ముందుగా పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి, భైంసా మున్సిఫ్ కోర్టు జడ్జిలు, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో విజయరామారావు, తహసీల్దార్ వెంకటరమణ ఆయనను ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా తన మనుమరాలు నిత్యకు అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం నిర్వహించారు.

**బ్రహ్మచారిణి అవతారంలో అమ్మవారు**

బాసర సరస్వతీ ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం సరస్వతీ అమ్మవారు బ్రహ్మచారిణి రూపంలో దర్శనం ఇచ్చారు. అమ్మవారికి పులిహోర నైవేద్యంగా సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మహారాష్ట్ర నుంచి తరలి వచ్చి చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిపించారు. అనంతరం ఉచిత అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

## కడెం, పెంబిలో క్రికెట్ పోటీలు

కడెం, అక్టోబర్ 16: కడెం మండలకేంద్రంలో సోమవారం కేపీఎల్ (కడెం ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలను ఎంపీపీ అంథోని అలెగ్జాండర్ ప్రారంభించారు. కడెంకు చెందిన ఫరీద్ అహ్మద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన స్మారకార్థం ఈ పోటీలను ఏర్పాటు చేశారు. కడెం, దస్తురాబాద్ మండలాల్లోని 8 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. సర్పంచ్ కొండాపురం అనూష, ఉపసర్పంచ్ ఆజాం, పీడీ రమణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గోళ్ల వేణు, నిర్వా హకులు గౌసొద్దీన్, శ్రీరాం, జాడి నర్స య్య, ముబారక్, వసీం, సుమంత్, ముస్తఫా, సంపత్, నాయకులు, తదితరులున్నారు.

**పెంబిలో..**

పెంబి, అక్టోబర్ 16 : మండల కేంద్రంలో దసరా ఉత్సవాల సందర్భంగా పెంబి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. 8 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, పాకాల రాంచందర్, ఏఎంసీ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల శంకర్, బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ స్వప్నిల్, నాయకులు బడుగు మల్లేశ్, తులాల శంకర్, పెండెల నరేశ్, మతీన్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## గొర్రెల మందపై చిరుత దాడి

ఖానాపూర్ రూరల్, అక్టోబర్16 : ఖానాపూర్ మండలం రాజురా అటవీ శివారులో సోమవారం గొర్రెల మందపై ఒ చిరుతపులి దాడి చేసింది. అదే గ్రామం చెందిన ముద్ద వెంకటరమణ మందను కాసేందుకు అటవీకి వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో మంద మేస్తూ ఉండగా గొర్రెల మందపై చిరుత దాడి చేసింది. రెండు గొర్రెలు మరో రెండు గాయ పడ్డాయి.


చిరుత దాడిలో మరణించిన గొర్రె

## యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శిగా నవీన్

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 16 : అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రెటరిగా మండలంలోని బీర్నందికి చెందిన జక్కుల నవీన్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ భవనంలో యాదవ మహాసభ నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు మహేశ్ యాదవ్ నియామక పత్రాలను అందజేశారు.

## పల్సిని మండలంగా ప్రకటించాలి


రిలే నిరాహార దీక్షల్లో గ్రామస్తులు

కుభీర్, అక్టోబర్ 16 : మండలంలోని పల్సి గ్రామాన్ని మండలం చేయాలని కోరుతూ మండల సాధన సమితి ఆధ్వర్యంలో గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సోమవారంతో ఈదీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. రైతులు ఈ రోజు దీక్షల్లో పాల్గొన్నారు. సాధన సమితి అధ్యక్షుడు కొట్టె సతీశ్, అబ్బాయి గజ్జారాం, దొంతుల చిన్నూ, సూర్యవంశీ భోజారాం, నిమ్మ లక్ష్మణ్, ఆసరి ఆనంద్ తదితరులు దీక్షలను పర్యవేక్షిస్తున్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 16 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ లింబాద్రి పేర్కొన్నారు. ఖానాపూర్ మండలం బీర్నంది గ్రామంలో ఓ దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. నిల్వ ఉన్న మందు బాటిళ్లను సీజ్ చేసి ఆ వ్యక్తిపై కేసును నమోదు చేశారు. ఈ మద్యం సుమారు రూ. 16, 170 వరకు విలువ ఉందని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

**మద్యం పట్టివేత**

కుభీర్, అక్టోబర్ 16 : మండలంలోని మార్లగొండ గ్రామంలో బెల్టు షాపు ద్వారా మద్యం అమ్ముతున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు భైంసా రూరల్ సీఐ నైలు తెలిపారు. సోమవారం కుభీర్ ఎస్ఐ ఎండీ షరీఫ్‌తో కలిసి ఆయా గ్రామాల్లో దాడులు నిర్వహించారు. కాగా రూ.10,500 మద్యం పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు

## ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

నిర్మల్ టౌన్, అక్టోబర్ 16 : ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు మాస్టర్ శిక్షకులు, నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ శిక్షణ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించి టెక్నికల్‌గా వచ్చే సమస్యలను పరిష్కరించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు, వ్యయాలు రిజిస్టర్ల నిర్వహణ, ఎన్నికల నియమావళి తదితర అంశాలపై అవగాహన పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## పాల్కెరు వాగు రోడ్డు పరిశీలన

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 16 : ఖానాపూర్ మండలం రాజురా చందునాయక్ తండాలోని పాల్కెరు వాగు వంతెన రోడ్డును హైదరాబాద్ చెందిన ఎస్ఈ మోహన్‌తోపాటు పలు అధికారులు పరిశీలించారు. ఎన్నికల అనంతరం పనులను ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ, ఏఈలు నిమ్మాజీనాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.